# విఎంఆర్డిఏ పరిధిలోని గ్రామాలలో అనధికార లేఔట్లకు పంచాయితీ అనుమతులిస్తే కఠిన చర్యలు

- జిల్లా పంచాయతీ అధికారి వై.సందీప్
- పేటలో పంచాయితీ పబ్లిక్ స్థలాలలో చురుగ్గా జియో ట్యాగింగ్
- 55 పంచాయతీ పబ్లిక్ స్థలాలలో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు
- అనధికార లే అవుట్ లలో వ్యక్తిగత ప్లాట్లకు కూడా ఎల్ఆర్ఎస్ కు



**(చట్టం న్యూస్ ప్రతినిధి) పాయకరావుపేట సెప్టెంబర్ 18 :** విఎంఆర్డిఏ పరిధిలోని గ్రామాలలో అనధికార లేఔట్లకు పంచాయితీ అనుమతులిస్తే సంబంధిత పంచాయతీల బాధ్యులపై కఠిన చర్యలు తప్పని జిల్లా పంచాయతీ అధికారి వై సందీప్ హెచ్చరించారు. పత్రికలలో ప్రచురితమైన వార్తలకు తీవ్రంగా స్పందించిన ఆయన అనధికార లేఔట్ లు ఉన్న అన్ని పంచాయతీలలోని పబ్లిక్ స్థలాల్లో తక్షణం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిపిఓ ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయమై గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రం పాయకరావుపేట సహా మండలంలోని పీఎల్ పురం, నామవరం తదితర పంచాయతీలలో ఇప్పటివరకు 55 వరకు పంచాయితీ పబ్లిక్ స్థలాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మండలంలోని నాలుగు పంచాయతీలలో గుర్తించిన 88 అనధికార లేఔట్లలో ఇప్పటికే చాలా వరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మిగతా స్థలాల్లో కూడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు ప్రక్రియ చురుగ్గా సాగుతున్నట్లు డిపిఓ తెలిపారు. పంచాయతీ పబ్లిక్ స్థలాలలో వేసిన హెచ్చరిక బోర్డులు ఎవరైనా తొలగించినట్లయితే అందుకు బాధ్యులపై క్రిమినల్ కేసులు తదుపరి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఇందులో భాగంగా గుర్తించిన అన్ని పంచాయితీ పబ్లిక్ స్థలాలకు జియో ట్యాగింగ్ ప్రక్రియ చురుగ్గా జరుగుతుందన్నారు. పంచాయతీలలో నిధుల లభ్యతను బట్టి పబ్లిక్ ఓపెన్ స్థలాలలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు డిపిఓ సందీప్ తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలో గల గ్రామ పంచాయతీలు విశాఖ మెట్రోపాలిటన్ ప్రాంతీయ అభివృద్ధి సంస్థ (విఎంఆర్డిఏ) పరిధిలో ఉన్నందున గ్రామ పంచాయతీల నుంచి అనాధికార లేఔట్ల ప్లాన్లకు సంబంధించి విద్యుత్ లైన్లు,మీటర్ల కోసం ఎటువంటి అనుమతులు, తీర్మానాలు సహా నిరభ్యంతర ధృవపత్రాలు (ఎన్ఓసి) జారీ చేయరాదని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. విఎంఆర్డిఏ తాజాగా ఆవిష్కరించిన లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) నిబంధనలను ఉల్లంగించి ఎవరైనా పంచాయతీల నుంచి అనధికార అనుమతులు తీర్మానాలు,ఎన్ఓసీలు జారీ చేసినట్లయితే అటువంటి వారిపై డిపార్ట్మెంటల్ చర్యలు తప్పవని డిపిఓ తీవ్రంగా హెచ్చరించారు.

విశాఖ మెట్రోపాలిటన్ ప్రాంతీయ అభివృద్ధి సంస్థ (విఎమ్ఆర్డిఏ) కొత్తగా ప్రవేశపెట్టిన లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) 26.7.2025 జీవో నెంబర్ 134 ప్రకారం అనధికార లే అవుట్ ల క్రమబద్ధీకరణ విషయమై సంబంధిత లేఅవుట్ ల యజమానులు స్పందించనట్లయితే ఆ లేఅవుట్లలో ఇళ్ల ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు తమ వ్యక్తిగత ప్లాట్లకు కూడా ఎల్ఆర్ఎస్ కు దరఖాస్తు చేసుకునే వీలును విఎంఆర్డిఏ కల్పించినట్లు డిపిఓ సందీప్ తెలిపారు. అనధికార లేఔట్లలో ఎల్ఆర్ఎస్ అనుమతుల కోసం ఈనెలాఖరు వరకు దరఖాస్తు చేసుకునే వీలున్నందున లేఅవుట్ యజమానులు లేదా కొనుగోలుదారులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు వేసిన అనర్ధికార లే అవుట్ లలో ఎల్ఆర్ఎస్ పథకానికి దరఖాస్తు చేసుకోదల్చిన ప్లాట్ల కొనుగోలుదారులు విధిగా తమ క్రయ దస్తావేజు,లింకు డాక్యుమెంటుతో పాటు ల్యాండ్ కన్వర్షన్ ధ్రువీకరణ పత్రం, సంబంధిత స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి తాజాగా ఎంకంబర్మెంట్ ధ్రువపత్రం (ఈసి) సహా ఆ రోజుకు ఉన్న సైట్ మార్కెట్ విలువ ధ్రువపత్రాలు సహా నిర్దేశిత శాతం రుసుం నకు సంబంధించి చలానా తదితర ధ్రువపత్రాలు విశాఖలోని విఎమ్ఆర్డిఏ కార్యాలయానికి సమర్పించినట్లయితే ఆయా ప్లాట్ల క్రమబద్ధీకరణకు వీదు కలుగుతుందని తెలిపారు. విఎంఆర్డిఏ కల్పించిన ఈ సదవకాశాన్ని లే అవుట్ యజమానులు లేదా కొనుగోలుదారులు విధించిన గడువులోగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సందీప్ కోరారు.

# అవినీతికి పాల్పడుతున్న కేజీబీవీ ఎస్ఓ పై క్రిమినల్ కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలి

- వర్కర్లపై తప్పుడు ఆరోపణలు చేసిన ఎస్ ఓ, జి సి డి ఓ క్షమాపణ చెప్పాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గంధసిరి జ్యోతిబసు






**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18,(చట్టం న్యూస్) :** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బ్రాహ్మణపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) లో అవినీతి అక్రమాలకు పాల్పడుతూ అక్రమంగా 10కింటాల బియ్యం అమ్మిన ఎస్ ఓ సునీత పై క్రిమినల్ కేసులు నమోదు చేసి సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేజీబీవీ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గంధసిరి జ్యోతిబసు మాట్లాడుతూ.. అవినీతి ఆక్రమాలకు పాల్పడుతున్న పెద్ద గూడూరు బ్రాహ్మణపల్లి కేజీబీవీ ఎస్ఓ ఇప్పుడే కాదు గతంలో కూడా విద్యార్థులకు వస్తున్నటువంటి కిరాణం సరుకులను బయట అమ్ముకునేది అనే ఆరోపణలు ఉన్నాయి. గత రెండ్రోజుల క్రితం 10 కింటాల బియ్యం అమ్మితే విక్రయించిన వ్యక్తే ఎస్ ఓ దగ్గర ఉండి మరి బియ్యన్ని పంపించారు అని చెబుతే నేడు విచారణలో ఎస్ ఓ నాకు ఎటువంటి సంబంధం లేదు మొత్తం వర్కర్లే అమ్ముకున్నారని చెప్పి వర్కర్ల మీద నీచమైన ఆరోపణలు పెడుతున్నారు ఎస్ ఓ సునీత తో పాటు జి సి డి ఓ విజయ్ కుమారి కూడా వర్కర్లని తిట్టడం వారిపై ఆరోపణలు చేయడం సరైనటువంటిది కాదు తక్షణమే వాటిని వెనక్కి తీసుకోని వర్కర్లకి క్షమాపణ చెప్పాలి ఎస్ఓ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా నాయకులు ఎండి అమీర్, కొలిపాక వీరేందర్, టౌన్ నాయకులు వంశీ,సమీర్, తరుణ్,అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18,(చట్టం న్యూస్) :** విశ్వకర్మ జయంతి సందర్భంగా ఉగ్గంపల్లి గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులందరూ విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.అనంతరం విశ్వకర్మ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కందుకూరి ఉపేంద్ర చారి, ఉపాధ్యక్షులు కొండపర్తి ఏకాంబరాచారి,కోశాధికారి, జుజ్జూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కందుకూరి వీరాచారి,సభ్యులు వెంకన్న, వీరభద్ర చారి, బ్రహ్మచారి, వీరాచారి, చిన్న ఉపేంద్ర చారి, అనిల్, వేమన్, పవన్, శ్యామ్, వినయ్, శశికాంత్, మధు శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

## దోమలు బాబోయ్ దోమలు

**నార్పల సెప్టెంబర్ 18, (చట్టం) న్యూస్ :** నార్పల గ్రామపంచాయతీ పరిధి నందు 18 వార్డులు కలవు గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి దోమలు విపరీతంగా పెరగడంతో చిన్న పిల్లలకు పెద్దలకు ముసలి వాళ్లకు అందరికీ కూడా దోమలు కుట్టడం వలన జ్వరాలతో హాస్పిటల్ చుట్టూ తిరుగుతున్నారు అదేవిధంగా సీజనల్ వ్యాధులు చికెన్ గునియా డెంగ్యూ మలేరియా ఇలాంటి రోగాలు బారిన పడకుండా పంచాయతీ సెక్రెటరీ గారు చొరవ తీసుకుని పంచాయతీ సిబ్బంది ద్వారాదోమల పొగ ఫాగింగ్ చేయాలని అదేవిధంగా గత మూడు సంవత్సరాల నుండి దోమల పొగ వదల్లేదని గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు కావున తక్షణమే దోమల పొగ వదలాలని కోరుతున్నారు

## మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

### విశాఖ తుపాన్ హెచ్చరికల కేంద్రం

విశాఖపట్టణం,సెప్టెంబర్18 : రాష్ట్రంలో పలుచోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ తుపాన్ హెచ్చరిక కేంద్రం అధికారి తెలిపారు. రాయలసీమ, తెలంగాణ, మరాఠ్వాడ ప్రాంతాలలో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని చెప్పారు. రాయలసీమలో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఈ సమయంలో మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్ళకూడదని విశాఖ తుపాన్ హెచ్చరిక కేంద్రం అధికారి హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉరుములతో కూడిన వర్షాలు పడేటప్పుడు చెట్ల కింద నిలబడటం మంచిది కాదని వ్యాఖ్యానించారు. ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. కోస్తాంధ్రలో పలు జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## బిజెపి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్..

- నంచర్ల రామాలయంలో పరిసరాల పరిశుభ్రత..
- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్..



**పెగడపెల్లి, సెప్టెంబర్ 18 చట్టం :** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని నంచర్ల గ్రామంలో 1300 సంవత్సరాల క్రితం నిర్మించబడిన అతి ప్రాచీనమైన అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో బిజెపి మండల అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి, అధ్యక్షతన స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో నరేంద్ర మోడీ, జన్మదినం పురస్కరించుకొని జాతీయ పార్టీ ఆదేశానుసారం 15 రోజుల పాటు సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్, మాట్లాడుతూ ప్రపంచ నాయకుడు యుగ పురుషుడు దామోదర్ దాస్ నరేంద్ర మోడీ, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భారతదేశాన్ని సుభిక్షంగా పాలించి భారత ప్రజలకు రక్షకునిగా సేవకుడిగా సేవలు అందించే విధంగా ఆ శ్రీరామచంద్రుడు సహకరించాలని సీతా సమేత శ్రీరామచంద్రుని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని పరిసరాలను పరిశుభ్రం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు.ఈకార్యక్రమమంలో ప్రోగ్రామ్ ఇంచార్జీ కట్ట మహేష్, మండల కన్వీనర్ జక్కుల హరీష్,మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చింతకింది అనసూయ, మండల ప్రధాన కార్యదర్శి తోడేటి గట్టయ్య, ఉపాధ్యక్షుడు సాయిల్ల తిరుపతి,కార్యదర్శి కడారి జనార్దన్ ,అంకం అనిల్, యువమోర్చ నాయకులు చేపూరి సురేశ్,నిఖిల్ గౌడ్, పలుమారు అంజన్న,



## పార్టీ అభివృద్ధికి విస్తృతంగా కృషి చేయాలి,

### వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణ రెడ్డి



**నార్పల సెప్టెంబర్ 18 (చట్టం) న్యూస్ :** గ్రామీణ ప్రాంతాలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ప్రతి ఒకరి విస్తృతంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో సింగనమల నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన నూతనంగా ఎన్నికైన వైయస్సార్ సిపి అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పని చేయాలన్నారు. రాష్ట్రంలో రైతులు మహిళలు ఎస్సీ ఎస్టీ బీసీ బడుగు బలహీన వర్గాల ప్రజలను గాలికి వదిలేసిందన్నారు. వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంతో గ్రామీణ ప్రాంతాలలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు నిలదీస్తూ ఉండాలన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఎవరు అధైర్య పడరాదన్నారు. పనిచేసే కార్యకర్తలకు ఎప్పుడు గుర్తింపు ఉంటుంది అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని సీఎం చేసుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల జడ్పిటిసి భాస్కర్ , రైతు సంఘం అధ్యక్షులు జయరాం రెడ్డి,చికెన్ నారాయణస్వామి, శ్రీనివాస్ రెడ్డి,సాకె లక్ష్మీనారాయణ, వరికూటి కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.



## దశాబ్ద కాలం పూర్తి అవుతున్న ప్రారంభానికి నోచుకోని నీలి కుర్తి గోపాల మిత్ర భవనం

### సిపిఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ



**మరిపెడ, సెప్టెంబర్ 18, చట్టం న్యూస్,:** మరిపెడ మండల కేంద్రం లో నీలి కుర్తి గోపాలమిత్ర భవనం పూర్తి అయి దశాబ్ద కాల మవుతున్న ప్రారంభానికి నోచుకో లేదు గోపాలమిత్ర భవనాన్ని ప్రారంభించాలి జిల్లా పశు వైద్యాధికారికి కిరణ్ కుమార్ కి పలు అంశాలతో కూడిన వినపత్రాన్ని మరిపెడ మండలంలోని నీలుకుర్తి పరిధిలోని నీలుకుర్తి ఆనే పురం బాబాజీ గూడెం ఉమ్మడి గ్రామాల పరిధిలో గోపాల మిత్ర భవనం నీలి కుర్తి గ్రామంలో దశాబ్ద కాలం క్రితం మంజూరై భవనం పూర్తయిన నేటి వరకు గోపాల మిత్ర భవనం ప్రారంభం కాకుండా శిథిల వ్యవస్థలోకి వెళ్ళింది కాబట్టి ఈ పరిధిలో ఉన్న గ్రామాలను రైతాంగాన్ని పశు సంపదని దృష్టిలో పెట్టుకొని తక్షణమే పశువు సంపదని కాపాడాలని గోపాల మిత్ర భవనాన్నిప్రారంభించాలని తమరి దృష్టి సాధించి సమస్యను పరిష్కరించాలనిసిపిఐ మరిపెడ మండల సమితి తరఫున తెలియజేస్తున్నాము ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్ పట్టణ కార్యదర్శి మల్లెపాక యాకన్న నాయకులు వీరేందర్ తదితరులు పాల్గొన్నారు

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత.

- పేద కుటుంబానికి అండగా మాజీ మార్కెట్ చైర్మన్ నీలం సుహాసిని దుర్గేష్.



**కేసముద్రం చట్టం న్యూస్ సెప్టెంబర్ 18 :** కేసముద్రం విలేజ్ లో ని ఎన్టీఆర్ నగర్ కు చెందిన బానోత్ రాఖి ఇటీవలే మృతిచెందగా విషయం తెలుసుకున్న కేసముద్రం వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ నీలం సుహాసిని దుర్గేష్ మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం గా 2000 రూపాయలు 50 కేజీల బియ్యం ఇవ్వగా స్థానిక తండా నాయకుల చేతుల మీదుగా అందించారు. మృతుడి రాఖి మరణం పట్ల విషాదం వ్యక్తం చేస్తు నివాళులర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు. ఈ సహాయం కాకుండా కుటుంబానికి ఎల్లవేళలా ఏ ఆపద వచ్చిన వెన్నంటి ఉంటామని వారు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో తండా పెద్దలు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

**చట్టం సాహితీ లోకం** 95814 19999

## గోపాలుని భక్తి గేయం

గోపాల నంద గోపాల
గోపిజన ప్రియ గోపాల
దేవకి నందన గోపాల
వసుదేవ కుమార గోపాల

నందనందనా నవనీత చోర
యదుకుల బాల గోపాల
సుందర వదన గోపాల
సుమధుర మురళీ గానవిలోల

గోపకిశోర గోవర్ధన ధారీ
గోవుల గాచిన గోపాల
కాళీయ మర్దన గోపాల
కంస చాణూర మధుర గోపాల

రాక్షస సంహారక గోపాల
గంధర్వ శాప విమోచన గోపాల
గరుడ వాహన గోపాల
గోకుల నాయక గోపాల

మురళీధర హరి గోపాల
మునిజన సేవిత గోపాల

మంజుల రూపక గోపాల
మోహన బాలక గోపాల

రుక్మిణి మనోహర గోపాల
రణజయభ భీమ గోపాల
సత్యాప్రియ హరి గోపాల
అష్ట బార్య సహిత గోపాల


నల్లనయ్య రార గోపాల
నవనీత చోరక గోపాల
నగుమోము గలవాడ గోపాల
నాతోడ మాటాడు గోపాల

అక్కి నర్సింలు గౌడ్
విశ్రాంత ఉపాధ్యాయుడు
మల్లాపూర్ రంగారెడ్డి జిల్లా
కవి గాయకుడు



**చట్టం సాహితీ లోకం** 95814 19999

## ఇదే అసలు విశ్వరూపం




పైన పటారం లోన లోటరాం
డొల్లను కప్పి గోలను ఆపి మసి పూసి మారేడు కాయ చేసినట్టు

తినటానికి గింజలు లేకున్నా మీసాలకు సంపెంగ నూనే రాసి

పెచ్చులు ఊడునట్టు హెచ్చులకు పోయి పోయి ఉచితాలు అంటూ గొప్పలు చెప్పుతూ

అప్పు చేసి అడుగక పోయినా పప్పు బెల్లాలు పంచుతూ

ఆర్థిక వ్యవస్థను సల్లసల్లగా గుల్లగుల్ల చేస్తూ

జనాల చేతికి చిప్పలు ఇస్తూ బోడి నవ్వులు నవ్వుతూ వాస్తవికతను మరుగున పరుస్తూ ఖననం చేస్తూ

మొత్తం దగదగ వెలిగిపోతున్నట్టు ఫోజులు పెడుతూ

మనల్ని మనం చంపుకుని ఆ కంపులో బతుకు యాత్ర కానరాని నరక జాతరలా జీవిస్తూ

అ మాయలో నడుస్తూ భరిస్తూన్న జన విశ్వ రూపం అదొక మురికి కూపం

రచన...సయ్యద్ హయ్యూల్ హయ్యూమ్
చురకశ్రీ కావలి నెల్లూరు జిల్లా



**చట్టం సాహితీ లోకం** 95814 19999

## నేతల కోతలు, మారని తలరాతలు



అరచేతిలో స్వర్గం చూపిస్తూ ఆగని నేతల కోతలు
అందని సౌకర్యాలు, అలమటిస్తూ మారని జనాల తలరాతలు.
దేశంలో వనరులకు,సంపదకు ఏమాత్రం కొదవలేదు,
పంపిణీ మాత్రమే చక్కగా జరగటం లేదు అన్నాడు అమర్త్యసేన్.
ప్రభుత్వాలు పథకాల పేరుతో ఖర్చు పెడుతున్న లక్షలాది కోట్లు.
పథకాల పేరుతో జాతికి మిగులుతున్నాయి, అందమైన భిక్షా పాత్రలు.
ఖర్చు పెట్టేది నూరు పైసలు, ప్రజలకుందేది పదిహేను పైసలు.
అందుకే నగదు బదిలీ పథకంలో ప్రజలకు సరాసరిగ డబ్బు ప్రయోజనం.
ప్రభుత్వ ఖజానాకు గుదిబండగా మారిన సంక్షేమ పథకాల అమలు.
పైనుంచి కిందకు వచ్చేసరికి ఖజానా కరుగుతోంది మంచు గడ్డలా.
దారి పక్కన పథకాల బోర్డులను చూసి,
అందనివారు బాధపడుతూ
నీతులు చెప్పేవారు, పదేపదే అభివృద్ధి గురించి బోధలు చెబుతూ.
ముప్పది శాతం పైగా నిరక్షరాశులు నిండిన దేశంలో అవగాహన ఎలా?
మా నరసయ్య మాస్టారు చెప్పినట్టు ఇప్పుడు జరిగేది ఇంగిలీసు చదువులు
తెల్లవాడి పరిపాలన సక్కగా సాగటం కోసం బంట్రోతులను, బానిసలను
తయారు చేసే కారా?ణాలుగా మారిపోతున్న పాఠశాలలు. ప్రయోగాలు.
రోడ్డు పక్కన రంగురంగుల జండా కాగితాలు ఎప్పుడు ఎగురుతూనే ఉంటాయి.
పేదవాడి చేతిలో సగం నిండిన భోజన పాత్ర పడుతూనే ఉంటుంది రోదన.

రచన: ముక్కా సత్యనారాయణ
పెనుగంచిప్రోలు, ఎన్టీఆర్ జిల్లా

**చట్టం సాహితీ లోకం** 95814 19999

## తగులుకుంటె బంధం. తెంచుకుంటె మోక్షం.

వినరా నరుడా!
చెపుతా శివ తత్వం!
నాది అన్న బంధం!
తనది అంటె మోక్షం!
తగులుకుంటె బంధం!
వదులుకుంటె మోక్షం!

వచ్చు దారి తెలియదు!
ఎరుక లేదు పోవు దారి!
నట్ట నడుమ నాటకం!
మూడునాళ్ల ముచ్చట!
తగులుకుంటె బంధం!
వదులుకుంటె మోక్షం!

ఏమి లేదు తెచ్చింది!
ఏమి వచ్చు పోవునాడు!
దాచింది దొంగ పాలు!
దాన మిచ్చింది నీకు తోడు!
వున్ననాడె అందరూ నీ వారు!




కడనాడు వచ్చువారెవరు?

మాయ నిజము కాబోదురా!
శివతత్వమె నిత్య సత్యమురా!

రచన:
బాచిరాజు సత్యనారాయణ రావు,
(బా. స.రా)
విజయవాడ.

**చట్టం సాహితీ లోకం** 95814 19999

## మనసు పాడిన మధుర గీతము



నా మనసు పాడెనుగ మధుర గీతము,
నా తనువు చేసెనుగ మనోహర నృత్యము,

పాఠశాలలో ప్రథమ స్థానము తెచ్చె మదికి నందము,
పరుగులు తీసె పరువపు వయసున పెంచె బంధము,

మనసు సందడి చేసె కళాశాలలో,
మనువు బిగువుగ మారె మధ్య మధ్యలో,

చదువులలో ప్రథమ శ్రేణి మనమునకు సరదాలు తెచ్చెను,
మదుపు కూడిన అభియంత చదువు మానసము మెచ్చెను,

మంచి ఉద్యోగాలు యెదకు నందము నిచ్చెను,
మధురమైన జీవనమును మనసును మురిపించెను,

మనసుకు ముచ్చట నిచ్చిన పచ్చని సంసారము,
మంచికి విలువ నిచ్చిన మంచి సంతానము,

విశ్రాంత జీవనము తెచ్చెను మమతల విలాసము,
వినోదపు కవనము యిచ్చెను మానసోల్లాసము,

మనసు లోన మందారాలు విరిసెనే,
మాన్యత తోడ గుండెలో మధురోహలు కురిసెనే!!

డాక్టర్ కురవి వేంకట కృష్ణ శాస్త్రి, చెన్నై





## స్వర్ణోత్సవ ఆత్మీయ స్నేహ సమ్మేళనం

అందరం ఏడుపదుల వయస్సు కొచ్చామని
ఆనందంగా రెండు రోజులు గడుపుదామని
ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఏబది సంవత్సరాలక్రిందట
అపరిచితులుగా చేరినా ఆత్మీయంగా కలసి మెలసి
ఆనందంగా గడిపిన రోజులు గుర్తుచేసుకుందామని
ఆప్యాయతగా ఎక్కడ ఉన్నావు ప్రసాదు అని
ఆరునెలల క్రిందటే హైదరాబాద్ లో ఉన్న శ్రీరామమూర్తి ఫోన్ చేసి
అమెరికా నుంచి అనకాపల్లి వరకు మనతో చదివిన మిత్రులు వస్తున్నారని
అందరు మనుమలనెత్తామని
అందని తీరాలకు చేరిన గురువులను మిత్రులను తలచుకుందామని చెబితే
ఏబది సంవత్సరాల క్రిందట చదివిన మిత్రులం కలసి
అప్పడు జగదాంబలో రెండవ ఆట చూసిన సినిమాలు
బీచ్ లో ఆడిన ఆటలు
క్యాంపస్ లో చేసిన అల్లరి
అందనంత ఎత్తుకు ఎదిగినా
ఆపకుండా మాట్లాడుకుని
వేళకు మితంగా ఆహారం తీసుకోండి
బి.పి.షుగర్ లను అశ్రద్ధ చేయవద్దని
పిల్లల మనుమల విషయాలలో తలదూర్చకండని
ఒంటరిగా ప్రయాణం చేయవద్దని
సమూహపు వాట్సప్ లో రోజు కలుద్దామని
కాదేది వయస్సుకనర్హం అని

**చట్టం సాహితీ లోకం** 95814 19999

రెండు రోజులు పాతజ్ఞాపకాలతో
వృద్ధాప్యపు జాగ్రత్తలతో
రెండుక్షణాలల గడిపి
నెరసిన జుట్టుతో
నడవలేక కుంటుతు బోసి నోటితో
బోడితలలతో జుత్తు లేక
ఆయాస పడుతు
ఎన్నో ఎన్నెన్నో ముచ్చట్లు జాగ్రత్తలు చెప్పుకుని
గతించిన స్నేహహితులను తలచుకుని
మన స్టేషన్ వచ్చి దిగే వరకు తప్పక ప్రతి సంవత్సరం కలుసుకుందామని
ఒకరినొకరు కౌగలించుకు వదల లేక వదలలేక వెళ్ళిన మాస్వర్ణోత్సవ స్నేహితుల ఆత్మీయబంధం సృష్టిలో తీయనిదే....!!

కవిమిత్ర, సాహిత్యరత్న
ఆచార్య అయ్యలసోమయాజుల ప్రసాద్
(పుష్యమి) హైదరాబాద్.




**చట్టం సాహితీ లోకం** 95814 19999

## అన్నపూర్ణాదేవి ఆదుకోవమ్మ

జయ మన్నపూర్ణమ్మ జగదాంబ మంగళం
దయజూడు మనురాగవల్లి నీరాజనం

కౌమారి నిగమార్థ విజ్ఞాన దీపమువు
కామితార్థప్రదా కనకాంబరాధరివి
సోమానలార్క సమానకుంతలధరీ
నమశ్శతములు నారాయణసహోదరి


రాగద్వేషాతీత ప్రార్థింతు నిన్నెడద
భోగభాగ్యద శాంకరీ మోక్షదాయినీ
నాగోడు వినవమ్మ ననుగావ రావమ్మ
యోగానందదాయి భవభయహారిణివి

కైలాసవాసి కాశీపురాధీశ్వరీ
శైలేంద్రనందినీ సర్వసంపత్కరీ
లీలావినోదినీ రిపుకోటిక్షయకరీ
మాలపాశాంకుశపాణి పుస్తకధరీ

తిరువిద్దెకేళాడ సురనిమగ్న జూపుము
తిరుకైవల్యమ్ము తిరిపెముగ నిడుము
కరుణాకరి శివంకరి కరుణ గురిపింపుము
మరలిరాని మణిద్వీపమున చోటిమ్ము

ధర్మనిష్ఠాకరివి త్రైలోక్య రక్షాకరివే
నిర్మలాంతఃకరణి నిఖిల పుణ్యప్రోవు
కర్మమోచనకరీ కైవల్యదాయినివి
దుర్మార్గహారి శంకరుకు సంతోషమిదు

రచన:: శంకర్ జీ దబ్బీకార్
ఊరు::ఇబ్రాహీంపట్నం రంగారెడ్డి
చరవాణి::9160297956



**చట్టం సాహితీ లోకం** 95814 19999

## స్నేహశీలి, ప్రేమస్వరూపి,మానవతా మూర్తి, నిజాయితీ పరుడు, ప్రజ్ఞాశాలి గౌ : శ్రీ పాలపర్తి రత్తయ్య గారికి జన్మదిన శుభాకాంక్షలు

మిత్రమా! పాలపర్తి రత్తయ్య గారు
మీ భవిత కావాలి చక్కని కవిత
అందుకోండి మా అభినందనల కవిత

మీ జన్మ దినోత్సవ వేడుక కావాలి
మీ బంధుమిత్రులకు ఆనందాల డోలిక

పాలపర్తి ఇంట ఉద్భవించిన మీరు
ప్రతిభ పాఠవాలు ఎన్నో నేర్చుకుని

%ూ. ా జ%, డిప్లమా డిస్కంటిన్యూ చేసి
ఆర్థిక అసమానతలవలన

ఉన్నత చదువులు చదవలేక
భవితకు బాటలు వెతుక్కుంటూ

A. P S. RTC లో కండక్టర్గా చేరి
పట్టువదలని విక్రమార్కునిలా పనిచేసి
మన్ననలు,అభినందనలు అందుకున్న

శ్రీ పాలపర్తి రత్తయ్య గారి
ప్రతిభాను గుర్తించిన అధికారులు

ఏపీఎస్ ఆర్ టి సి స్క్వాడ్ ఇన్చార్జిగా
పాలపర్తి రత్తయ్యగారిని ఎన్నిక చేసి

వారి ప్రతిభకు పట్టం కట్టినారు
ఏపీఎస్ ఆర్టీసీ ఉన్నత అధికారులు
అధికారుల కార్మికుల ప్రశంసలు పొంది

ఉత్సాహం పని చేసినారు
శ్రీ పాలపర్తి రత్తయ్య గారు

28, 05,1994 కట్టా వారి అమ్మాయిని
ఘనంగా వివాహం చేసుకున్నారు

వీరికి కామేశ్వరరావు,, స్వప్న లు
వీళ్ళ ప్రేమకు ప్రతిఫలంగా జన్మించారు

పిల్లలను ఉన్నతంగా చదివించారు
ఉజ్వల భవిష్యత్తుకు పునాదైనారు

కుల కట్టుబాట్లు తెంచుకొని
కులాంతర వివాహం చేసినారు

తాను ఓ మనిషిగా ఉన్నత వ్యక్తిగా
సంఘములో నిలబడిన వ్యక్తి
గౌ :: శ్రీ పాలపర్తి రత్తయ్య గారు

తాను జన్మించిన గ్రామం చావాలి
భవితకు బాటనిచ్చిన గ్రామం చావలి

మమ్ము మనిషిగా నీల పెట్టిన గ్రామం
యోగక్షేమాలుకోరిన గ్రామముచావాలి

ఇంతటివిశిష్టత కలిగిన మా గ్రామానికి
మేము మాకుటుంబంరుణపడిఉన్నాం
అనిఅంటారు పాలపర్తి రత్తయ్య గారు

వారి కుటుంబం ఆయురారోగ్యాలతో
అష్టైశ్వర్యాలతో వర్ధిల్లుతూ
నిండు నూరేళ్లు జీవించాలని ఆశిస్తూ


ప్రేమతో.....
బంధు మిత్రులు,,ఆత్మీయులు

రచయిత సౌపాటి ప్రభాకర్
తెలుగు తేజం సాహితీ రత్న
నంది అవార్డుల గ్రహీత
బ్రాహ్మణ కోడూరు గ్రామం



## మరణంలేని మహానటుడు... డా.అక్కినేని..!

రామాపురం ఊరిలో
ఉదయించిన సూర్యకిరణం...
నిరుపేద రైతు కుటుంబంలో
వెంకటరత్నం పున్నమ్మలను
పుణ్య దంపతులకు జన్మించిన
పుత్రరత్నం నటసామ్రాట్
డాక్టర్ అక్కినేని...



"ధర్మపత్ని"తో బాలకిరణమై
వెండితెరపై వెలిగి 255
చిత్రాల్లో నటించి ఏడు
దశాబ్దాలు
తెలుగు చలనచిత్ర
సామ్రాజ్యాన్ని ఏలి
"మనం"చిత్రంతో...క్యాన్సర్ తో...
మరలిరాని లోకాలకు తరలిపోయె...
ఆంధ్ర ప్రేక్షకుల గుండెల్లో ఆరని దీపమాయే...
తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డ
నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని...

జానపదం నుంచి పౌరాణికం వరకు
ప్రతిపాత్రకు ప్రాణప్రతిష్ట చేసిన శిల్పి
ఘంటసాల గీతాల్లో లిప్ మాయతో
రొమాంటిక్ స్టెప్స్ తో
కుర్రకారును ఉర్రూతలూగించి...
"నవరాత్రులు" చిత్రంలో
"తొమ్మిది పాత్రలు" పోషించిన...
"ద్విపాత్రాభినయం" చేసిన "తొలిహీరో"...
"నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని...

భక్త తుకారాం భక్తి...
దేవదాసు దుఃఖం...
బుద్ధిమంతుడి తెలివి...
ప్రేమాభిషేకం అనురాగం...
అక్కినేని అద్భుత నటనా
చాతుర్యానికి నిలువెత్తు
నిదర్శనం...

"శ్రీరామ జననం"లో
"రాముని పాత్రలో
...చెంచులక్ష్మి లో
"విష్ణుమూర్తి పాత్రలో
జీవించిన...
"రామకథను "వ్రాసిన
కవికోకిల మహర్షి
"వాల్మీకి పాత్రను"
ధరించిన...ధన్యజీవి
"నాస్తికుడైన నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని...

22 ఎకరాల అన్నపూర్ణ స్టూడియోస్
అధినేతకు...దర్శక రత్న దాసరి
దర్శకత్వంలో కాసులు కురిపించిన...
అఖిలాంధ్ర ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టిన
బ్లాక్ బస్టర్ మూవీ...ప్రేమాభిషేకం..
అది అక్కినేని నటనకు...పట్టాభిషేకం...

అనార్కలిలో అక్బర్ సలీమ్ గా
లైలా మజ్నులో మజ్ను గా...
ప్రేమనగర్ లో భగ్నప్రేమికుడిగా...
మహాకవి పండితుడైన కాళిదాసుగా...
మద్యానికి బానిసైన దేవదాసుగా...
"ట్రాజెడీ కింగ్" గా అద్భుతంగా నటించి...
అఖిలాంధ్ర ప్రేక్షకుల హృదయాలను
కొల్లగొట్టిన అగ్రశ్రేణినటుడు అక్కినేని...


గుడివాడ ఏఎన్నార్ కాలేజీకి...
వైజాగ్ ఆంధ్రా యూనివర్సిటీకి...
భూరీ విరాళమిచ్చిన
అపర దానకర్ణుడు అమరజీవి
అక్కినేని...

చదివింది నాలుగో తరగతేఐనా
ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడే
నడిచే విశ్వవిద్యాలయం...
తోటినటులకు, హీరోయిన్ లకు
ఒక ఆదర్శం...ఒక నటనాలయం
నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని...

అమెరికా ఆస్ట్రేలియా జపాన్ జర్మనీ
ఫ్రాన్స్ రష్యా దేశాల్లో పర్యటించి...
ఉత్తమ నటుడిగా...
మూడు ఫిల్మ్ ఫేర్ అవార్డులు...
పద్మ విభూషణ్ పురస్కారం...
దాదాసాహెబ్ ఫాల్కే అవార్డులందుకొని...
అవార్డులకే వన్నెతెచ్చిన వెండితెర వేల్పు
నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని...

తెలుగు సినిమా పరిశ్రమ
చెన్నై నుంచి హైదరాబాద్
రాకకు ఓ ప్రేరణాత్మక దీపస్తంభం...
ఆధ్యుడు...అమరజీవి డాక్టర్ అక్కినేని...

ఈ మహానటుడి కీర్తి
అజరామరం...ఆచంద్రతారార్కం...
వారు ప్రేక్షకులగుండెల్లో ఓ ఆరనిదీపం...
కులమతాలకు...
కుళ్ళు కుతంత్రాలకు...
రాజకీయాలకు అతీతంగా...
పదవీవ్యామోహం లేని...
అరమరికలులేని...
అవినీతి మరకలులేని...
అసూయా ద్వేషాలులేని...
నిండుకుండ...నిగర్వి
"అంచేత"వారు



హద్దులు మీరని
బుద్ధిమంతుడు...
దర్జాగా బ్రతికిన దసరా బుల్లోడు...
అందరు అభిమానించే అందాలరాముడు
మరణం లేని మహానటుడు...
నటసామ్రాట్ డా. అక్కినేని నాగేశ్వరరావు
వారికిదే నా అక్షర నీరాజనం...

రచన: కవి రత్న సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్

